క్లుప్తంగా

ఈ కారు ఎవరిది ?



ఆరు నెలలుగా చెక్‌పోస్ట్‌లో ఉన్న కారు

గుడిపాల: ఆరునెలలుగా ఓ కారు ఒకేచోట కదలకుండా ఉంది. నరహరిపేట చెక్‌పోస్ట్ వద్ద ఏపీ 39వీ5396 నంబరు గల ఓ కారు గత ఆరునెలలుగా చెక్‌పోస్ట్‌లోనే ఉంది. ఇన్ని రోజులు ఒకేచో ట ఈ కారు ఎందుకు ఉందని స్థానికులు అనుమాన పడుతున్నారు. ఎవరైనా చోరీ చేసుకుని తీసుకువచ్చి ఇక్కడ వదిలేశారా ? లేక స్మగ్లింగ్‌కు సంబంధించిన వాహనమా ? ఏదనేది తెలియదు. అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

పెట్రోల్ బంక్‌లో తనిఖీలు



పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ నరేంద్రపాటిల్

తవణంపల్లె: మండల కేంద్రం తవణంపల్లెలోని అరగొండ– చిత్తూరు ప్రధాన రహదారిలో పక్కన ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను మంగళవారం అదనపు కలెక్టర్ నరేంద్ర పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ బంకులో రికార్డులను పరిశీలించారు. బంకు ఆవరణలో ఆయిల్ నిల్వ ఉన్న ట్యాంకర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వాహనాలకు ఇంధనం పట్టే విధానాన్ని గమనించి, వాహనాదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సుధాకర్, ఆర్ఐ జీవన్‌సాగర్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

జానపద కళలపై అవగాహన



మాట్లాడుతున్న సహదేవనాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : జానపద కళారూపాలే భారతీయ సంస్కృతికి జీవనాడులని మన సంస్కృతి కళాసంస్థ జిల్లా అధ్యక్షుడు సహదేవనాయుడు అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జానపద కళలు, పాటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జానపద నృత్యాలు, జానపద పాటల్లో భారతీయ సాంస్కృతిక జీవితమంతా మిళితమై ఉందన్నారు. జానపద కళలను ప్రోత్సహించేందుకు గ్రామీణ, మండల, జిల్లా స్థాయిల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర, అధ్యాపకులు ఉషారాణి, షేక్‌షమ్స్‌అక్తర్, ధర్మమూర్తి పాల్గొన్నారు.

కేరళకు మున్సిపల్ కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ శిక్షణ నిమిత్తం కేరళ వెళ్లారు. ఘన వ్యర్థ నిర్వహణలో భాగంగా మూడు రోజులపాటు కేరళ రాష్ట్రంలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించనున్నారు. ఇన్‌చార్జ్ కమిషనర్‌గా మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి వ్యవహరిస్తారు. వచ్చే సోమవారం నరసింహ ప్రసాద్ విధులకు హాజరు కానున్నారు.

కనువిందు.. చందనాలంకరణ



చందన అలంకరణలో వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారు

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమార గిరిపై వెలసి ఉన్న శ్రీవళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారు మంగళవారం చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారిని చందనంతో అలంకరించి, ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఈఓ కృష్ణనాయక్ మాట్లాడుతూ వార్షిక ఆడికృత్తిక మహోత్సవాల్లో భాగంగా ఆలయానికి రూ.13 లక్షల 23వేల 922 ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో తలనీలాల ద్వారా రూ.1,27,000, హుండీ ద్వారా రూ.3,77,262, సేవా టికెట్ల ద్వారా రూ.6 లక్షల 5వేల 660, తాత్కాలిక దుకాణాల ద్వారా రూ.6 వేలు, చందాల రూపంలో రూ.1,72,000, గత నెల తెలుగు ఆడికృత్తిక సందర్భంగా కావళ్ల ద్వారా రూ.36 వేలు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

అప్రమత్తతే రక్ష

వర్షాకాలంలో పశుపోషణలో పాడి రైతులు అజాగ్రత్తగా వ్యవహరిస్తే ప్రమాదాలు సంభవించి నష్టాలు చవిచూడాల్సి ఉంది. ప్రస్తుతం పశువులకు సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉంది. రైతులు తగు సమయంలో జాగ్రత్తలు తీసుకుని సకాలంలో వైద్యం చేయించి పశువులను కాపాడుకోవాలి. అదేవిధంగా వర్షాకాలంలో పశువుల పట్ల అజాగ్రత్తలు ఉండడం వల్ల ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు సీజనల్ వ్యాధుల గురించి అవగాహనతో పాడి పశువులను కాపాడుకోవాలి.

పశువులకు వైద్యం చేస్తున్న పశువుల వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్



- సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పశుసంరక్షణ పాటించాలి
- వర్షాకాలంలో పాడిరైతులు అజాగ్రత్తతో ఉండవద్దు
- విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలి
- లేదంటే నష్టం తప్పదంటున్న పశువైద్యులు

తవణంపల్లె: ప్రస్తుత పరిస్థితుల్లో పశువులను కాపాడుకోవడానికి, పాల ఉత్పత్తి తగ్గకుండా చూసుకోవడానికి సీజనల్‌గా సోకే వ్యాధులను ముందస్తుగా గుర్తించి పాడిరైతులు నివారణ చర్యలు చేపట్టడం చాలా ముఖ్యమని పశువైద్యాధికారులు చెబుతున్నారు. దీనికితోడు వర్షాకాలంలో పొలాల్లో బోరు మోటార్ల దగ్గర, పశువుల పాకల్లో పశువులు కట్టేసేటప్పుడు పాడిరైతులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ఎందుకంటే కరెంటు తీగలు వేలాడుతుంటాయి గనుక వర్షాకాలంలో విద్యుత్‌తీగల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు. అదేవిధంగా విష సర్పాలు సంచరిస్తుంటాయి. పొలాల్లో పశువులను మేతకు వదిలినప్పుడు జాగ్రత్తగా రైతులు ప్రమాదాలు సంభవించకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

పొదుగువాపు నివారణ చర్యలు

- పొదుగువాపు నివారణకు సకాలంలో రైతులు చర్యలు చేట్టాలి. పశువుల పాకలను, పరిసరాలను శుభ్రం చేయించాలి. అదేవిధంగా పాలు పిండే వ్యక్తి, పాలు పిండే పరికరాలు శుభ్రంగా ఉంచితే పొదుగు వాపును నివారించవచ్చు.

ఈగలు, జోరీగల ద్వారా సంక్రమించే జబ్బులు

- హీమో ప్రోటోజోవల్ వ్యాధి ముఖ్యంగా జోరీగలు, గుర్రపుటీగల ద్వారా పశువులకు సంక్రమిస్తాయి. జ్వరం, మేత తినకపోవడం, నీరసం, మరికొన్ని పశువుల్లో గంజరం రంగు మారి కాఫీ రంగులోకి రావడం జరుగుతుంది.

ఈ వ్యాధిని నివారించడానికి సాయంత్రం వేళల్లో పాకల దగ్గర వరిగడ్డి, వేపాకుతో పొగ వేయాలి. లేదంటే పాకలలో దోమ తెరలు ఏర్పాటు చేయాలి.

పిడుదుల సమస్యకు..

- వర్షాకాలంలో వాతావరణం అనుకూలంగా ఉండడం వల్ల పిడుదుల పునరుత్పత్తి ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల పశువుల్లో రక్త హీనత ఏర్పడడంతో పాటు అనేక రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది.

సీజనల్‌గా సోకే పొదుగు వాపు లక్షణాలు

- మంచి పాల దిగుబడి కలిగిన పశువుల్లో అపరిశుభ్రత, పరిసరాల వల్ల సోకుతుంది. ఇందులో ప్రధాన లక్షణాలు పాలు రంగు మారి, పాలు తెలుపు రంగు నుంచి గోధుమ రంగు, కొన్ని ఎరుపు రంగులోకి మారి ఉంటాయి. అలాగే వాపు ఉండి నొప్పి కలిగిస్తుంది. అలాగే పశువులకు జ్వరం లక్షణాలు ఉంటాయి.
- 24 గంటల్లోపు వైద్యం కచ్చితంగా చేయించాలి. పశువులకు సకాలంలో వైద్యం చేయించకపోతే పాల దిగుబడి తగ్గుతుంది. పశువు రైతుకు సహకరించదు.

ఫుట్ రాట్..లక్షణాలు.. నివారణ..

- పశువుల కాళ్ల మధ్య భాగంలో వచ్చే సంక్రమణ. తడి, మురికి నేలపై ఎక్కువ సేపు ఉండడం వల్ల గిట్టల మధ్యలో పుండ్లు ఏర్పడి పురుగులు పట్టే అవకాశం ఉంది. దీని వల్ల గిట్టలు వాపు ఏర్పడుతాయి. పురుగులు పట్టడం వల్ల రక్తస్రావం జరగడంతో పాటు గాయం అవుతోంది.
- ఫ్రూట్ రాట్ నివారణకు పశువులను తేమ లేని ప్రదేశంలో కట్టాలి. శుభ్రంగా ఉంచుకోవాలి. పాకల్లో తేయ గుంటలు లేకుండా చూడాలి. గుంటల్లో పొడి మట్టి వేసి కప్పాలి.

- పిడుదుల నివారణకు ఒక లీటరు నీటిలో పిడుదుల మందును 2 ఎంఎల్ కలిపిన ద్రావణాన్ని ఉదయం వేళ పిచికారీ చేయాలి. ఆ తర్వాత పశువులు ఆ ద్రావణాన్ని నాకకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. మందును పిచికారీ చేసిన రోజు ఇంటి దగ్గర పశువులకు మేత, నీరు అందించాలి. అదేవిధంగా డొరామెక్‌టిన్ ఇంజెక్షన్ పశువులకు వేయడం వల్ల కూడా పిడుదులను నివారించవచ్చు.

జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు సంక్రమించడానికి వాతావరణం అనుకూలం. పాడి రైతులు పశువులకు ఎలాంటి లక్షణాలు ఉన్నా గుర్తించి వెటర్నరీ వైద్యులను సంప్రదించి వైద్యం చేయించాలి. పశువుల్లో సాధారణ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. సంకర జాతి పాడి పశువుల పోషణ పట్ల అప్రమత్తంగా ఉండాలి. సీజనల్ వ్యాధుల గురించి పాడి రైతులకు అవగాహన ఉండాలి.

– డాక్టర్ శ్రీధర్, వెటర్నరీ అధికారి, తవణంపల్లె

పంటల సాగుపై అవగాహన



వేరుశనగ సాగులో మెళకువల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని సరకల్లు, గురుకువారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో కలుపును తొలగించాలని సూచించారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పంటలకు మోతాదుకు మించి ఎరువులు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది, ఏఈఓ కుసుమ, రైతులు పాల్గొన్నారు.

తమ్ముడిపై అన్న దాడి

బంగారుపాళెం: మండలంలోని కొరివారిపల్లె మంగళవారం సాయంత్రం తమ్ముడిపై అన్న దాడి చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. దళితవాడకు చెందిన చిన్నస్వామి అతని తమ్ముడు శంకరయ్య మధ్య పొలం తగాదా ఉంది. ఈ నేపథ్యంలో పొలం విషయమై తగాదా పడ్డారు. దీంతో చిన్నస్వామి కుటుంబ సభ్యులు రాణెమ్మ, రవి, హరి తమ్ముడు శంకయ్య, అతని కుమారుడు నవీన్‌పై దాడి చేసి గాయపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. బాధితుడు శంకరయ్య ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

మోసానికి నిదర్శనం చంద్రబాబు

- గుడిపాలలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ
- ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించిన వైఎస్సార్‌సీపీ నేతలు



క్యూఆర్ కోడ్ స్కానింగ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హాజరైన కార్యకర్తలు, అభిమానులు

గుడిపాల: మోసానికి నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు.. ఎన్నికల సమయంలో ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని గుడిపాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం పాపసముద్రం, చిత్తపార గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు.. 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో ఒక్కటీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబుది సుపరిపాలన కాదని.. మోసాల పాలన అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక, మట్టి దౌర్జన్యం తప్ప ఏమీ కనిపించడం లేదన్నారు.

143 హామీలు ఏమయ్యాయి బాబు ?

ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలతో పాటు అమలు కాని 143 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. తల్లికి వందనం పథకంలో కూడా కొంతమంది తల్లులకు మాత్రమే డబ్బులు చెల్లించారన్నారు. ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే రాష్ట్రం అమ్మాలని కూటమి నాయకులు మాట్లాడడం మహిళలను అవమానించడమే అన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అందజేస్తామని చెప్పి గుడిపాల మండలానికి మొండిచేయి చూపించారన్నారు. అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఉచిత బస్సు పథకం ఉండదని చెప్పడంతో మహిళలంతా ఆగ్రహంగా ఉన్నారని వారు తెలియజేశారు. గుడిపాల మండలానికి మొత్తం రెండు బస్సుల్లో మాత్రమే తూతూమంత్రంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు రజనీకాంత్, మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్ రాయల్, జనార్ధన్, చిట్టి, నాయకులు సంపత్, చిట్టిబాబు, రమేష్, కృష్ణమూర్తి, భానుమూర్తిరెడ్డి, దీనా, కృష్ణమూర్తిరెడ్డి, ప్రసాద్, జ్యోతిరెడ్డి, దామోదర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, బాలసరస్వతి, సామ్‌వేల్, రజినిలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ



జాతీయ స్థాయి అబాకస్ గణిత పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు.

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని కొంగారెడ్డిపల్లిలో ఉన్న యూసీమాస్ సంస్థకు చెందిన అబాకస్ విద్యార్థులు జాతీయ స్థాయి పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు ఆ సంస్థ నిర్వాహకురాలు భార్గవి మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో జాతీయ స్థాయి అబాకస్ గణిత మేధ పోటీలు జరిగాయని తెలిపారు. ఈ పోటీల్లో తమ సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులు ప్రణతి, సయ్యద్ అయాన్ ఆలీ, శ్రీసహస్ర ప్రతిభ చూపి స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారని తెలిపారు. అలాగే కుందనశ్రీ, పఠాన్, రెడ్డిదీక్షిత్, యుక్తశ్రీ రజత పతకాలు, విష్ణుమూర్తి కాంస్య పతకం సాధించారన్నారు. అనంతరం జాతీయ స్థాయి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

పంటల పరిశీలన





వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వర్షానికి దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుడిపాల: జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల పంటల పరిస్థితిని పరిశీలించేందుకు మంగళవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, సరళ, వజంత, నాగమణి, డాక్టర్ హారతి, డీఆర్‌సీ చిత్తూరు ఏఓ మాధవి, గుడిపాల వ్యవసాయాధికారి సంగీత సంయుక్తంగా కలిసి పంటలను పరిశీలించారు. గుర్రాలమిట్ట, కొత్తపల్లె గ్రామంలోని వరి, వేరుశనగ, చెరకు పొలాలను సందర్శించారు. గుర్రాలమిట్టలో కోతకు సిద్ధంగా ఉన్న నాలుగు ఎకరాల వరిపైరు ఇటీవల కురిసిన వర్షానికి పడిపోయినట్లు గమనించారు. అధిక వర్షాలకు వరిపైరు నష్టపోకుండా జాగ్రత్తలు పాటించాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. వరి కోసి ఆరని పంటలకు తుపాన్ నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును వాటిపై చల్లాలన్నారు. గింజలు మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పంటపై పడే విధంగా పిచికారి చేయాలన్నారు. అనంతరం వేరుశనగ పంటను పరిశీలించారు.

'మా పింఛన్లను పునరుద్ధరించండి సార్'



పీడీఓ హరిప్రసాద్ రెడ్డికి అర్జీలు సమర్పిస్తున్న దివ్యాంగులు

తవణంపల్లె: ''నేను ఎప్పటి నుంచో పుట్టుకతో దివ్యాంగులం.. ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న దివ్యాంగుల పింఛన్‌ను తొలగిస్తూ.. నోటీసులు ఇచ్చారు.. మాపై కరుణించి దివ్యాంగుల పింఛన్‌ను పునరుద్ధరించండి'' పలువురు దివ్యాంగులు మంగళవారం ఎంపీడీఓ హరి ప్రసాద్ రెడ్డిని మొర పెట్టుకున్నారు. మండలంలోని అరగొండకు చెందిన దివ్యాంగుడు అమరనాథ్ పుట్టుకతో మాటలు రావు.. ఇటీవల సదరన్ క్యాంపులో వైద్యులు పరిశీలించి పింఛను తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడం దుర్మార్గం. తమకు తిరిగి దివ్యాంగుల పింఛను మంజూరు చేసి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశాడు. అదేవిధంగా పలువురు నోటీసు, ఆధార్ కార్డు, సదరన్ క్యాంపులో డాక్టర్ ఇచ్చిన సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో పాటు అర్జీలు సమర్పించారు. తొలగించిన పింఛనుదారులు ఇచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆరీఫా షేక్

పుంగనూరు: రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటి ఆదేశాల మేరకు వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్‌జడ్జి ఆరీఫా షేక్ తెలిపారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, అధికారులకు జడ్జి సమావేశం నిర్వహించి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించే కేసులపై అప్పీల్ ఉండదని, రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. కేసులతో కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, కాలం వృథా చేసుకోకుండా ఉండేందుకు లోక్ అదాలత్ సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు.

సజీవంగా చూపించగలిగేది ఛాయా చిత్రం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కాలగర్భంలో కలసిన చరిత్రను సజీవంగా చూపించగలిగేది ఛాయా చిత్రమని చిత్తూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథన్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ దినోత్సవ కేక్‌ను కోసి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మీడియా రంగంలో ఫొటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు కాళీశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, శివప్రసాద్, అనిల్, శివకుమార్, రాజేష్, జయకర్, సురేష్, సూరి, మహేష్, అభి, చిరంజీవి, హేమంత్ చంద్రప్రకాష్, శ్రీను, ప్రవీణ్, జయకుమార్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలు ఐక్యంగా ఉండాలి

వి.కోట: మండలంలో అన్ని వర్గాలు ఐక్యంగా ఉండి హిందూ–ముస్లింలు సఖ్యతతో మెలగాలని తహసీల్దార్ ఉదయ్ సంతోష్, సీఐ సోమశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఐ ఆధ్వర్యంలో వి.కోట పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. వి.కోటలో అనూహ్యమైన సంఘటనలు చోటుచేసుకుని అల్లర్లకు పాల్పడిన ఘటన జరిగి ఏడాది అయిన నేపథ్యంలో గత అనుభావాలను అధికారులు గుర్తు చేసుకున్నారు. వి.కోటలో వర్గ, వర్ణ, కులమతాలకు అతీతంగా వర్తక, వాణిజ్య, శ్రామిక, కర్షక వర్గాల వారందరూ ఐక్యంగా ఉంటున్నారని, ఈ వాతావరణాన్ని ఇలా కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరి ఇళ్లలో ఏ పండగైనా మతాలకతీతంగా అందరూ పరస్పరం సహకరించుకోవాలన్నారు. అలాగే పట్టణంలోని వేణుగోపాలస్వామి గుడి వీధిలో మాంసవిక్రయాలు జరుగుతున్నాయని, గతంలో పెద్దల కుదిర్చిన ఒప్పందాన్ని కొందరు లెక్కచేయకుండా దుకాణాలు నిర్వహిస్తుండటంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాక రాబోవు వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయక ప్రతిమలపై చర్చించారు.

అన్నదాత సుఖీభవ సమస్యలు పరిష్కరించండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

యాదమరి: అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సమస్యను పరిష్కరించాలని ఆర్డీఓ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొందరు అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందలేదన్నారు. క్షేత్రస్థాయిలో మన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పలువురు అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన రీసర్వేపై ఆరా తీశారు. రెవెన్యూ సమస్యలపై అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ పార్థసారథికి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దీప, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తుల వెల్లువ

గుడిపాల: అన్నదాత సుఖీభవకు సంబంధించి రైతులకు నగదు జమ కాకపోవడంతో దరఖాస్తులు వెల్లువగా వస్తుంది. గుడిపాల మండలంలో 6,743 మంది రైతులు ఉండగా ఇందులో 4,827 మందికి మాత్రమే అన్నదాత సుఖీభవ నిధులు వచ్చాయి. మొత్తం 1916 మంది రైతులకు వెబ్‌ల్యాండ్‌లో ఆధార్‌లింక్ కాకపోవడంతో వారందరికీ నిధులు నిలిచిపోయాయి. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని వీఆర్‌ఓలకు సూచించారు. దీంతో మంగళవారం పాపసముద్రం సచివాలయంలో అన్నదాత సుఖీభవ పడని రైతులంతా దరఖాస్తులను వారికి అందజేశారు. దీంతో పాటు రీసర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎమ్‌లు, ఆధార్ వెరిఫికేషన్ కూడా పరిశీలిస్తున్నారు. అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలియజేశారు.

అన్నదాత సుఖీభవపై సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్‌ఓ భవాని

బంగారుపాళెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్నదాత సుఖీభవ పథకంపై పలమనేరు ఆర్డీఓ భవాని సమీక్ష నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం ఇంప్లిమెంటేషన్‌లో భాగంగా జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్(ఎల్‌పీఎం)విధానంపై ఏఓలు, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లకు అవగాహన కల్పించారు. భూ సర్వేపై తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సింగిల్ ఎల్‌పీఎంలుగా మార్చేందుకు అవకాశం కల్పించి, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేసేందుకు అకాశం కలిప్పించిందన్నారు. దీన్ని సమగ్రంగా చేపట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, డీటీ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.